క్లుప్తంగా

కొత్త నంబర్‌కు ఫిర్యాదు చేయండి

శాంతినగర్: ఇటీవల పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు మారాయని బాధితులు కొత్త నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని శాంతినగర్ ఎస్‌ఐ శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న సెల్: 9490619617 నంబర్ వినియోగించడం లేదని ప్రస్తుతం ఆ నంబర్ స్థానంలో ప్రస్తుతం సెల్: 8712670290 అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

ముగిసిన సప్తాహ భజనలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగులాంబ ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శివపంచాక్షరి మహామంత్ర సప్తాహ భజనలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా వారిని శేషవస్త్రాలతో జూనియర్ అసిస్టెంట్ శేఖర్ సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఈ ఏడాది రూ.10 వేలు దేవస్థానం నుంచి సంభావన ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణానికి చెందిన ఎస్.ఆంజనేయులు సప్తాహ భజనలు నిర్వహించిన భక్తులకు రూ.10 వేలు అందజేశారు.

అఖిల భారత మహాసభలకు ఎంపిక

అలంపూర్: అఖిల భారత మహాసభలకు అలంపూర్‌కు చెందిన రేపల్లె దేవదాసు ఎంపికయ్యారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌర నగరంలో ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ పదో మహాసభలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతీయ సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు ప్రతినిధిగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. జాతీయ సదస్సుకు ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మిర్చి దొంగలు అరెస్టు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు తమ పంట పొలాలలో నిల్వ చేసిన మిర్చిని ఎత్తుకెళ్తున్న ఇద్దరు దొంగలను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. ఇటీవలే బిజ్వారం గ్రామ శివారులోని రైతు పొలంలో ఎండుమిర్చిని నిల్వ చేశారు. రెండు ద్విచక్రవాహనాలపై మిర్చిని ఎత్తుకెళ్లేందుకు ఇద్దరు వచ్చారు. గమనించిన చుట్టు పక్కల పొలాల రైతులు కేకలు వేయడంతో దొంగలు అక్కడే వాహనాలను వదిలేసి పారిపోయారు. రెండు మోటారు సైకిళ్ల నంబర్ల ఆధారంగా అయిజకు చెందిన విష్ణు, ఎక్లాస్‌పురంకు చెందిన కురువ ఆంజనేయులుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి గద్వాల కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

మానవపాడు: మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం కుష్ఠు వ్యాధిపై అధికారి మధన్‌మోహన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు వివరించారు. ఎవరికైనా తెల్లమచ్చలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. పరీక్షలు అన్ని ఉచితంగా చేస్తారన్నారు. విద్యార్థులు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అనురాధ, వైద్య సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పల్లకి విరాళం



ధరూరు: మండలంలోని కోతులగిద్ద అరణ్జేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజల నిమిత్తం ఆలయానికి పల్లకీని మండలంలోని మార్లబీడు గ్రామానికి చెందిన బంట్రోతు సుజాత, వెంకట్‌రెడ్డి విరాళంగా అందజేశారు. సోమవారం పల్లకీని స్వామి వారి సేవలో వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్లు పంపిణీ



అయిజ: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం వైదిక్ మాథ్స్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వైదిక్ మాథ్స్ కో ఆర్డినేటర్ మురహరి మాట్లాడారు. కేజీబీవీలో 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు వైదిక్ మాథ్స్‌ను బోధించినట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు మెడల్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్ ఇంజమ్మ, కేజీబీవీ ఎస్‌ఓ చెన్నబసమ్మ, కేజీబీవీ సీఆర్‌టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న రామకృష్ణనాయుడు



గట్టులో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశానికి విద్యుత్ అధికారుల గైర్హజరుపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. అంతంపల్లి, మిట్టదొడ్డి గ్రామాల్లో నిర్మించిన ఇంకుడు గుంతలకు బిల్లులు రాలేదంటూ ఆయా గ్రామాల సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన వివరాలను ఏఓ హనుమంత్ రెడ్డి సభలో ప్రస్తావించారు. మండలంలోని 15,861 మంది రైతులకు యాసంగి పంటకు రైతుబంధు సాయం ఖాతాలలో జమ అయ్యిందన్నారు. 3 నెలల్లో 32 మంది రైతులు మృతి చెందగా, 16 మందికి రూ.5 లక్షల చొప్పున బీమా పరిహారం అందజేశామన్నారు. అనంతరం ఎంఈఓ కొండారెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలల్లో మొత్తం 218 పోస్టులుండగా, 174 మంది పని చేస్తున్నారని, 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాసు శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ చెన్నయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

కేటీదొడ్డి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మనోరమ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, తహసీల్దార్ సుందర్ రాజు, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంఈఓ సురేష్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివమాలధారుల ప్రత్యేక పూజలు



ఉండవెల్లి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకుంటున్న శివ స్వాములు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం శివస్వాములు ఇరుముడిని కట్టుకున్నారు. ఆలయం నుంచి డి.బుడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తి సంకీర్తలను ఆలపిస్తూ చేరుకున్నారు. అనంతరం శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న భక్తులకు శివాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, సుర్జి, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన శివ భక్తులు సోమవారం శ్రీశైలానికి బయలుదేరారు. అంతకుముందు ఇరుముడి ధరించి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివమాల ధరించిన భక్తులు వివిధ వాహనాలపై శ్రీశైలానికి వెళ్లారు. కొంతమంది భక్తులు కాలినడకన శ్రీశైలానికి బయలుదేరారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయం దగ్గర సోమవారం శివ స్వాములకు ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వాములు ఇరుముడులతో ఊరేగింపుగా భజనలు చేస్తూ పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. అదేవిధంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

ధరూరు: శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేసేందుకు సోమవారం ఉదయం శ్రీశైలానికి తరలివెళ్లారు. పది సంవత్సరాల నుంచి అన్నదానం చేస్తునట్లు ట్రస్టు నిర్వాహకులు, అర్చకులు కేశవాచార్యులు, వామనాచార్యులు, కిష్టాచార్యులు, తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



భజన పోటీలో భజన మండలి సభ్యులు



గిరక పోటీలో బల ప్రదర్శన

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయంలో జాతర సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహించారు. అదేవిధంగా సోమవారం ఒంటెద్దు బల ప్రదర్శన (రెండు బండ్ల గిరక) పోటీలను నిర్వహించారు.

భజన పోటీలో విజేతలు

కర్నూలు జిల్లా, ఉయ్యాల వాడకు చెందిన విరాట్ విశ్వకర్మ భజన మండలి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 20 వేలు దక్కించుకున్నారు. రెండోస్థానంలో జోగుళాంబ గద్వాల జిల్లా పర్దిపురానికి చెందిన మారుతి భజన మండలి నిలిచి రూ. 15 వేలు, తృతీయ స్థానంలో పర్దిపురానికి చెందిన మల్లి ఖార్జున భజన మండలి రూ. 10 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన బుడ్డారెడ్డి పల్లికి చెందిన అభయ ఆంజనేయస్వామి భజన మండలి సభ్యులకు రూ. 8 వేలు బహుమతులు అందజేశారు. అదేవిధంగా తొమ్మిది స్థానాలలో నిలిచిన భజన మండలి వారికి బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

జెండా దిమ్మెల ఏర్పాటుకు అనుమతివ్వండి



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎస్పీ జెండాలను ఏర్పాటు చేయడానికి అనుమతులను ఇవ్వాలని తహసీల్దార్‌కు, ఎంపీడీఓకు నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీరభద్రప్పకు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డికి బీఎస్పీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ప్రతి గ్రామంలో జెండా దిమ్మెల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాసు, రాము, శివ, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్ఫూర్తితో ముందుకెళ్తాం

గద్వాల అర్బన్: వివేకానంద స్ఫూర్తితో ముందుకెళ్తామని ఏబీవీపీ ఉమ్మడి పాలమూరు, నల్గొండ సంఘ్ ప్రముఖ్ బీజాపూర్ కరేందర్ నాథ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏబీవీపీ జిల్లా విద్యార్థి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశం స్వాతంత్ర్యం కోసం అనేక మంది ప్రాణాల త్యాగాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం ఏంఎఎల్‌డీ డిగ్రీ కళాశాలకు వరకు శోభాయాత్రను నిర్వహించారు. అంతకు ముందు ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్వేత, అశోక్, జిల్లా కన్వీనర్ సురేష్, గణేష్ పాల్గొన్నారు.



శోభాయాత్రను నిర్వహిస్తున్న నాయకులు

దయానంద సరస్వతి సేవలు మరువలేం



ధరూరు: దయానంద సరస్వతి సేవలు మరువలేమని ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని రేవులపల్లి క్యాంపులోని జెన్‌కో డీఏవీ పాఠశాలలో దయానంద సరస్వతి 200వ జయంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా దయానంద సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి, సమాజానికి దయానంద చేసిన సేవలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన



కరపత్రాలను విడుదల చేస్తున్న రామచంద్రారెడ్డి

అయిజ: ముఖ్యమంత్రి కేసీఆర్‌ది నియంతృత్వ పాలన అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు కేజీబీవీలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఉత్తనూరు, భూంపురం, సింధనూరు, పులికల్, మేడికొండ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి ఎన్నికలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శాసన మండలిలో ప్రతిపక్ష సభ్యులు లేకపోవడం వలన పాలకపక్షం తప్పులపై ప్రజల తరుపున వాణి వినిపించడంలేదని అన్నారు. గతంలో బీజేపీ సభ్యులు రామచంద్ర రావు కృషివల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



గద్వాల క్రైం: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసు సిబ్బంది సోమవారం అదుపులోకి తీసుకున్నారు. చెనుగోనిపల్లి శివారుల్లోని వజ్రాల గుట్ట నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నట్లు గ్రామస్తులు కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గద్వాల తహసీల్దార్ వేంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది సహాయంతో తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న అయిదు ట్రాక్టర్ల గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్లపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ అధికారులపై చర్య తీసుకోవాలి

శాంతినగర్: తప్పుగా ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చి పొలం కోల్పోవడానికి కారణమైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు భారతి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు భీమన్న డిమాండ్ చేశారు. గతంలో వడ్డేపల్లికి చెందిన బోయ భారతి తన భర్త నాగేశ్వరరావు చనిపోవడంతో భర్తకు రావాల్సిన పొలాన్ని తన పేరున చేయాలని రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. వారసులు ఐదుగురు ఉండగా అందులో ముగ్గురు పేర్లు మాత్రమే నమోదు చేసి ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చారు. వాస్తవం తెలుసుకోకుండా వారసత్వం సర్టిఫికెట్ ఆధారంగా బాధితురాలి మరిది చిట్టిబాబు పేరున రెండెకరాలు భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయాన్ని బాధితురాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్‌ను నరేంద్రను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో తప్పుడు సర్టిఫికెట్ ఇవ్వడానికి కారకులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ జయరాములును వివరణ కోరగా ఐదు మంది సభ్యులకు గాను కంప్యూటర్ ఆపరేటర్ ముగ్గురు పేర్లు నమోదు చేయడం వాస్తవమన్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

ఉండవెల్లి: ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని కలెక్టర్ మండల అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు వీసీ ద్వారా మాట్లాడారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటునట్లు అధికారులు తెలిపారు. కంచుపాడులో రేణుక ఎల్లమ్మ ఆలయంలో స్థలం విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాలని దీనికి ఎంపీడీఓ, ఎంపీఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రప్ప, పంచాయతీ కార్యదర్శి జరీనాబేగం, ఎంపీఓ పద్మావతి, ఏఓ సురేఖ, ఆస్మా, ఏఎన్ఎం వినోదిని, ఏపీఎం మరాతమ్మ, పశువైద్యాధికారిని శిరిషా, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న మండల అధికారులు

మొక్కలను సంరక్షించాలి

మల్దకల్: హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు సూచించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో నాటిన మొక్కలను వారు పరిశీలించారు. హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలను సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులు సూచించారు. లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలన్నారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటి వాటికి ట్రీగార్డులను ఏర్పాటు చేయాలన్నారు. నాటిన మొక్కలకు పాదులు తీసి పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

గద్వాల అర్బన్: బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని 1098 చైల్డ్ లైన్ సభ్యులు కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని బస్వల్ చేర్వులో సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల, బాలికలకు ఏదైన సమస్యలు తలెత్తితే వెంటనే 1098కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: బాల్య వివాహాలపై ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు గిరిబాబు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని నీలిపల్లిలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, లైంగిక, వరకట్న వేధింపులుపై అవగాహన కల్పించారు.

రైతుల పక్షాన ఆందోళన చేపడతాం

శాంతినగర్: రైతులకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయకపోతే వారి పక్షాన ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగశిరోమణి, నాగరాజు హెచ్చరించారు. సోమవారం వడ్డేపల్లి విద్యుత్‌శాఖ కార్యాలయం ముందు ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సక్రమంగా సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండుతున్నాయని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, దేవేందర్, చిన్నబాబు, పచ్చర్లకుమార్, నాగరాజుగౌడ్, లాల్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

గట్టు: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామలలు అన్నారు. సోమవారం మండలంలోని మిట్టదొడ్డిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వారు భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని 10 పంచాయతీలకు వివిధ అభివృద్ధి పనులుకు రూ.కోటి మంజూరయ్యాయన్నారు. సీసీ రోడ్లను నాణ్యతా ప్రమాణాలు పాటించి వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు నర్సింహులు, ఎంపీటీసీ ఏజాతమ్మ, నాయకులు నాగరాజు, చార్లెస్, ఏసేపు, తిమ్మప్ప, నాగన్నగౌడు, రాజేష్, ఆనంద రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు వరకు పాదయాత్ర చేస్తాం

అయిజ: మండలంలోని మేడికొండ-పులికల్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయకుంటే నాగుల్‌దిన్నె బ్రిడ్జి నుంచి హైకోర్టు వరకు పాదయాత్ర నిర్వహించి, కోర్టు దృష్టికి సమస్యను తీసుకెళ్తామని చిన్న హెచ్చరించారు. సోమవారం అసంపూర్తిగా ఉన్న మేడికొండ రోడ్డుపై తాండ్రపాడుకు చెందిన సుధాకర్ గౌడ్‌తో పాటు పులికల్, మేడికొండ గ్రామాలకు చెందిన ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్ మాట్లాడారు. రోడ్డు సరిగా లేకపోవడంతో వివిధ వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురయ్యారని, కొంతమంది కాళ్లు, చేతులు విరిగి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో హైకోర్టు జడ్జి హిమా కోహ్లీ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గత సంవత్సరం మార్చిలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారని, ఇప్పటివరకు రోడ్డునిర్మాణం పూర్తికాలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పులికల్, మేడికొండ గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఓబులోనిపల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, సర్పంచు పరుశరాముడు, యూత్ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, నాయకులు జాకీర్, నాగన్న, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

గద్వాల రూరల్: పేదలకు అండగా సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో గట్టు, ధరూర్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, బస్వరాజ్, కుర్మన్న, సంగాల రాములు పాల్గొన్నారు.

ఘనంగా సత్యాత్మతీర్థ శ్రీపాదుల జన్మదినం



అర్చకులకు వస్త్రదానం చేస్తున్న అడ్వకేట్ భీమ్‌సేన్‌రావు

గద్వాలన్యూటౌన్: ఉత్తరాది మఠాధిపతి 1008 సత్యాత్మ తీర్థ శ్రీపాదుల వారి 51వ జన్మదినం వేడుకలను సోమవారం భీమ్‌నగర్‌లోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ భీమ్‌సేన్‌రావు ఆధ్వర్యంలో బీచుపల్లి, చింతరేవుల, ధరూర్, మల్దకల్, గద్వాల పట్టణంలోని వివిధ ఆలయాలలోని త్రిమతస్థ ఆలయ అర్చకులకు వస్త్రదానం, దక్షిణ ఫలతాంబూలాలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసన్నచార్య పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

మానవపాడు: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ విస్తరణ అధికారులతో పీఎం కిసాన్ ఈ కేవైసీ అంశంపై సహాయ వ్యవసాయ సంచాలకులు సక్రియనాయక్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 1200 మంది రైతులు ఈకేవైసీ, ఎన్‌పీసీఐ చేయించుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు గురించి వివరించారు. రైతులు పీఎం కిసాన్ సమ్మాని నిధి కోసం ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.